నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 14 జూన్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

మాటల యుద్ధం

- సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లకు అమ్ముడుపోయిన గద్వాల జిల్లా కాంగ్రెస్ నాయకులు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్ కుమార్

గద్వాల/ధరూర్, జూన్ 13 : సీడ్ కంపెనీలకు, ఆర్గనైజర్లకు జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ నాయకులు అమ్ముడు పోయారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జిల్లాకు వచ్చిన క్రమంలో సీడ్ పత్తి రైతుల సమస్యలను విన్నవించడానికి వెళ్లిన కుర్వ విజయ్‌కుమార్‌ను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి ధరూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు దళారులకు అండగా నిలిచి పేద సీడ్ పత్తి రైతుల పొట్ట కొడుతున్నారన్నారు. రైతు కమిషన్ ఎదుట గోడు వెళ్ల బోసుకుందామని వెళ్తున్న సీడ్ పత్తి రైతులను అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. సీడ్ పత్తి పేరుతో జరుగుతున్న మోసాలను రైతు కమిషన్ దృష్టికి తీసుకొని వెళ్లకుండా సమస్య ఉన్న ధరూర్, మల్దకల్, కేటీదొడ్డి, గట్టు మండలాల్లో కమిషన్ పర్యటించాల్సి ఉన్న సంబంధం లేని పుటాన్‌పల్లి గ్రామానికి మార్చారని, ముందస్తు పథకం ప్రకారమే కమిషన్ పక్కదారి పట్టించే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించారన్నారు. కంపెనీలు, ఆర్గనైజర్లు ఒక ముఠాగా ఏర్పడి రైతులను మోసం చేస్తున్నారని ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో రైతు కమిషన్‌కు తాను ఫిర్యాదు చేస్తే స్పందించి కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి శుక్రవారం గద్వాలకు వస్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు సీడ్ పత్తి రైతుల సమస్యలను పక్కదారి పట్టించేలా చేశారన్నారు. రైతులకు న్యాయం చేయాలని రైతు కమిషన్ చైర్మన్ దగ్గరకు వెళితే అక్రమంగా తనను అరెస్ట్ చేసి ధరూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. పుటాన్‌పల్లి గ్రామంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పర్యటించనున్న సందర్భంలో నష్టపోయిన రైతులను ఆయనకు కలిపించి వారికి న్యాయం చేయించాలనే ఉద్దేశంతో రైతులను అక్కడికి తీసుకెళ్తున్న నన్ను అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేసి రైతుల బాధలు చెప్పకుండా చేశారని మండిపడ్డారు. సీడ్ పత్తి రైతుల సమస్యలు పరిష్కరించక పోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే రైతుల పక్షాన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని వెల్లడించారు.

గద్వాల,జూన్ 13 : విత్తన పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులు పండించిన సీడ్ విత్తనాలు పాస్ అయిన ఫెయిల్ అయినట్లు చూయిస్తూ రైతులను మోసం చేస్తున్న విషయాలను గత వారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ హైదరబాద్‌లో మాజీ మంత్రులు, హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతి పత్రం అందజేయడంతోపాటు, రైతులకు జరుగుతున్న అన్యాయాలను వారికి వివరించారు. అందుకు స్పందించి రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జిల్లాలో రైతులు సాగు చేసిన సీడ్ పత్తి పంటను పరిశీలించడంతో, రైతుల సమస్యలు వినడానికి శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ముందుగా గద్వాల మండలం పుటాన్‌పల్లి గ్రామంలో కోటేశ్వర్‌రెడ్డి అనే రైతుతో కలెక్టర్ సంతోష్ మాట్లాడిన అనంతరం కమిషన్ చైర్మన్ అక్కడ రైతులు సాగు చేసిన పత్తి పంటను కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్‌కు చెందిన సీడ్ ఆర్గనైజర్లు, రైతులతో మాట్లాడ నివ్వకుండా ఆర్గనైజర్లే సమస్యలను వివరిస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్ సీడ్ పత్తి రైతుల సమస్యలు ఒక చోట ఉంటే మరొక చోట ఎలా చూయిస్తారని, సమ స్య ఉన్న చోటకు వెళ్దామని కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతుండగా కాంగ్రెస్‌కు చెందిన కొంత మంది నాయకులకు, బీఆర్ఎస్ నేత విజయ్‌కుమార్ మధ్య మాటలు యుద్ధం నెలకొంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు తప్పడంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను శాంతిప జేశాయి. రైతు కమిషన్ చైర్మన్ పంట పొలాలను పరిశీలించకుండానే అక్కడ నుంచి వెళ్లి పోయారు. రైతు కమిషన్ చైర్మన్‌తో కలిసి కలెక్టరేట్‌కు విజయ్‌కుమార్ వెళ్లే సమయంలో అతనిని బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేసి రేవులపల్లి పో లీస్ స్టేషన్‌కు తరలించారు. గొడవకు కారణమైనా కాంగ్రె స్ నాయకులను మాత్రం పోలీసులు వదిలి పెట్టారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న మల్దకల్ మండలానికి చెందిన రైతును పోలీసులు మెడ బట్టి తోసుకుంటూ తమ వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల బాధలు చెప్పకుండానే, సమస్యలు వినకుండానే అన్యాయంగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానానికి నిదర్శనమని రైతులు మండిపడ్డారు. ప్రజల పక్షాన పోరాడే వారిపై అక్రమ అరెస్ట్‌లు, దౌర్జన్యాలు కాంగ్రెస్ పాలనలో సర్వ సాధారణ మయ్యాయని రైతులు పోలీసుల, ప్రభుత్వ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ పర్యటన అనంతరం విజయ్‌కుమార్‌ను పోలీసులు వదిలి పెట్టారు.

- రైతు కమిషన్ చైర్మన్ పర్యటనలో రభస
- సీడ్ పత్తి రైతుల సమస్య ఉన్న చోటుకు వెళ్దామన్న బీఆర్ఎస్ నేత విజయ్
- అడ్డుపడిన కాంగ్రెస్ నాయకులు
- రెండు వర్గాల మధ్య తోపులాట
- శాంతింపజేసిన పోలీసులు
- విజయ్‌తోపాటు పలువురి అరెస్టు
- కాంగ్రెస్ నేతలను వదిలేసిన ఖాకీలు

చైర్మన్‌తో గోడు వెళ్లబోసుకుంటున్న విజయ్

తోపులాటలో నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బీఆర్ఎస్ నేత విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి లాక్కెళ్తున్న పోలీసులు

అనుమతులు రద్దయ్యే వరకు పోరాటం..

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసి, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసే వరకు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో 12 గ్రామాల రైతులు, ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తాం. ఏం పాపం చేశామని మాపై అక్రమంగా కేసులు పెట్టి జైళ్లకు పంపుతారు. కేసీఆర్ హయాంలో దళితులకిచ్చిన భూములతోపాటు రైతుల భూములు ఎందుకు పనికి రాకుండా పోతాయనే ఆవేదనతోనే ఆందోళన చేస్తున్న తమను నిర్బంధంలో ఉంచారు. మంత్రులు, అధికారులు, పోలీసులను కలిసి తమ బాధలను వివరించినా ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయకపోగా, యాజమాన్యంతో కలిసి సర్కారు కేసులు పెట్టించింది. రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్, పెద్ద ధన్వాడ, రాజోళి మండలం

అర్హులకు దక్కని ఇందిరమ్మ ఇండ్లు

- ఇదేం ప్రజాపాలన.. అంతా మోసమని నిలదీత
- అధికారులు, సర్కారు తీరుపై ప్రజాగ్రహం

వంగూరు జూన్ 13 : ప్రజా పాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలైన పేదలను విస్మరిస్తున్నది. నిత్యం నేతలకు దండం పెడుతూ వారి భజన చేసే వారికే పథకాలు అందుతున్నాయని.. ఇదేనా ప్రజా పాలన అంటూ పలువురు పేదలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 433 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ప్రత్యేక గ్రామంగా గుర్తించిన మండలంలోని మిట్టసదగోడులో 53 ఇండ్లు మంజూరయ్యాయి. దీంతో మొత్తం 486 ఇండ్లు మండలానికి మంజూరై ప్రొసీడింగ్‌లు సైతం లబ్ధిదారులకు అందించారు. వీరిలో చాలా వరకు అనర్హులకే ఇందిరమ్మ ఇల్లు వరించిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా వుండగా వంగూరు మండల కేంద్రానికి చెందిన ఒగ్గు రమణమ్మ అనే పేద మహిళకు ఇండ్లు మంజూరైనట్టే అయ్యి చివరికి రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నది. వంగూరులో కేవలం ఒక రూంలో ఉంటూ పక్కన ఇటుకతో కట్టిన గోడల్లో భార్యాభర్తలు కాపురం చేస్తున్నారు. మొదట ప్రభుత్వం విడుదల చేసిన ఆన్‌లైన్ ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో రమణమ్మ పేరు ఉండగా స్థానిక ఎమ్మెల్యే ఫైనల్ చేసిన అసలు లిస్టులో రమణమ్మ పేరు లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై మనస్తాపం చెందింది. స్థానిక నేతలతోపాటు మండల నేతలు కలిసి తనకు మంజూరైన ఇళ్లను ఉద్దేశ్య పూర్వకంగానే తీసేశారని ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పెద్దలు పార్టీ కోసం పని చేసే వారికి వారిచ్చే బహుమతి ఇదేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇళ్లు లేక ఇటుకలతో కట్టిన గోడల ఎదుట నిల్చున్న రమణమ్మ

ఇల్లు లేక వేరే వాళ్ల ఇంట్లో ఉంటున్నాం..

ఇల్లు లేక వేరే వాళ్ల ఇంట్లో వుంటూ కాలం వెల్లదీస్తున్నాం. పిల్లలు పెద్దగయ్యిర్రు. మా అమ్మ ఇదే పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయింది. అయినా పార్టీనే నమ్ముకొని వున్నాం. ఇల్లు లేక కట్టిన గోడలు కొంత వాడుకుంటున్నం. ఇల్లు వస్తుందని ఎంతో ఆశతో ఉంటే రాలేదు. ప్రజా పాలన అంటూ మస్తు మాట్లాడుతరు. ఇదేం పాలన, అంతా మో

- ఒగ్గు రమణమ్మ. వంగూరు

సదస్సును బహిష్కరించాం..

గ్రామంలోని రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడంతో బుధవారం ఏరువాక పండుగను జరుపుకోలేదు. భూభారతి రెవెన్యూ సదస్సు పెట్టడంతో రైతులకు ఏం లాభం చేకూరదని భావిస్తున్నాం. గ్రామ రైతులు కొందరు జైళ్లో ఉండగా, కొందరు కేసుల భయంతో గ్రామంలో లేరు. ఈ క్రమంలో సదస్సులతో తమకు ఒరిగేదిలేదని సదస్సును బహిష్కరించాం.

- ఆశీర్వాదం, రైతు, పెద్ద ధన్వాడ, రాజోళి

- పెద్ద ధన్వాడలో హాజరుకాని అన్నదాతలు
- ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం
- అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన ఆగదని హెచ్చరిక
- రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్

భూభారతి సదస్సు బహిష్కరణ

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్ద ధన్వాడ గ్రామస్తులు

రైతులు ఎవరూ రాకపోవడంతో ఖాళీగా కూర్చున్న అధికారులు

అయిజ, జూన్ 13 : పెద్ద ధన్వాడలో రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయడంతోపాటు రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను బేషరతుగా సర్కారు ఉసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును శుక్రవారం పెద్దధన్వాడ గ్రామస్తులు, రైతులు బహిష్కరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా పోరాటం చేస్తున్న తమపై ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం భౌన్సర్లు, పోలీసులతో రెచ్చగొట్టే విధంగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని అధికారులు, పాలకులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా రైతులపై అకారణంగా కేసులు పెట్టి జైళ్లకు పంపడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వానకాలం పంటల సాగు చేసుకునే సమయంలో కోర్టులు, జైళ్లు, పోలీస్ స్టేషన్లకు తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగారు పంటలు పండే సారవంతమైన భూములు ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో కలుషిత కారకాలతో నిండిపోయే ప్రమాదం ఉండడంతోనే ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ గత 8 నెలలుగా 12గ్రామాలకు చెందిన రైతులు, గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడుతున్నారు. ఈ నెల 4న జరిగిన సంఘటనలో 40 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి, 12 మందిని జైలుకు పంపారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు పూర్తిగా చేసి, 40 మందిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసే వరకు తమ పోటరాం ఆపేదిలేదన్నారు.

భూభారతి రెవెన్యూ సదస్సు బహిష్కరణ..

రాజోళి మండలంలోని పెద్ద ధన్వాడలో శుక్రవారం తాసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో భూభారతి రెవెన్యూ సదస్సును రైతు వేదికలో ఏర్పాటు చేశారు. ఉదయం 10:30 గంటలకు అధికారులు రైతు వేదికకు చేరుకున్నప్పటికీ రైతులు ఎవరు చేరుకోలేదు. గురువారం గ్రామస్తులు ముక్తకంఠంతో రెవెన్యూ సదస్సును బహిష్కరించాలని తీర్మానం చేసుకోవడంతో కొద్ది మంది రైతులు రైతు వేదికకు చేరుకొని భూభారతి రెవెన్యూ సదస్సును బహిష్కరిస్తున్నట్లు తాసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు, రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేస్తామని సర్కారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే వరకు భూభారతి సదస్సులు నిర్వహించవద్దని అధికారులకు సూచించారు.

- క్రీడాకారులకు అపారమైన అవకాశాలు
- టీజీ పీఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్‌కుమార్
- పీయూలో ప్రశాంతంగా ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్టులు

ఆధునీకత దిశగా అడుగులు..

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 13 : క్రీడలపై ఆసక్తి ఉన్నవారు శిక్షకులుగా రాణించాలని ఆశించేవారికి అపారమైన అవకాశాలు ఉన్నాయని టీజీ పీఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ అన్నారు. టీజీ పీఈ -సెట్ 2025 ఎంపికల్లో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో కొనసాగుతున్న ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, స్కిల్ టెస్టులు శుక్రవారం సెట్ కన్వీనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు సంబంధించి విద్య, పరిశోధన, శిక్షణల్లో ఆధునికత దిశగా అడుగులు వేయాలని సూచించారు. స్పోర్ట్స్ కోచ్‌లకు వారి నైపుణ్యాలను అనుసరించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో డిమాండ్ ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో సంబంధిత క్రీడా శిక్షకులుగా రాణించవచ్చన్నారు. ఫిట్‌నెస్ సెంటర్లలో మేనేజర్‌గా ఎదగవచ్చు. ప్రైవేట్ క్రీడా కేంద్రాల్లో స్పోర్ట్స్ కోచ్‌గా అవకాశాలు అందుకోవచ్చు. క్రీడాకారులకు మెంటర్‌గా వ్యవహరించవచ్చు. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, లక్ష్యం దిశగా అడుగులు పడేలా ప్రోత్సహించేది మీరే అని ఉద్ఘాటించారు. ప్రభుత్వ, ప్రైవేటు స్పోర్ట్స్ అకాడమీలు, శిక్షణా కేంద్రాల్లో అవకాశాలుంటాయని, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో స్పోర్ట్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా రాణించవచ్చన్నారు. అంతకు ముందు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ షేక్ మహమ్మద్ గాల్లోకి కాల్పులు జరిపి పరుగుపందెం పోటీలను ప్రారంభించారు. పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాట్లు బాగున్నాయని కితాబు ఇచ్చారు. ఒకప్పుడు కరవు జిల్లాగా ఉన్న పాలమూరు ఈ రోజు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుండటం ఎంతో అభినందనీయం అని పేర్కొన్నారు. పీయూ వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ బీపెడ్, డీఎడ్‌లలో అడ్మిషన్లు పొందాలంటే టీజీ పీఈ సెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. మూడో రోజు బీపెడ్‌లో 403 మంది విద్యార్థులకు గానూ 248 మంది, డీపెడ్ కోర్సులో 132మందికి గాను 75మంది విద్యార్థులు హాజరయ్యారని పీయూ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమాల్లో పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు, దీప్ల నాయక్, పీయూ పీఆర్వో శేకుంటి రవికుమార్, అధ్యాపకులు, డా.జ్ఞానేశ్వర్, వెంకటేశ్‌యాదవ్, అర్జున్‌కుమార్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పీడీ సత్యభాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన స్టేడియం కోచ్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థినులకు, పరిశీలకులకు సూచనలు చేస్తున్న టీజీ పీఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్‌కుమార్

- పాల్కంపల్లిలో దరఖాస్తులు తీసుకోవడం లేదని రైతుల ఆవేదన

రెవెన్యూ సదస్సులతో నిరుపయోగం

వంగూరు, జూన్ 13 : ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిన వెంటనే చేపట్టిన రెవెన్యూ సదస్సులు రైతులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. కేవలం తూతూ మంత్రంగానే సదస్సులు నిర్వహిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కేవలం పెద్ద రైతులకు మాత్రమే ఉపయోగపడే భూభారతితో రెవెన్యూ సదస్సులు ఎందుకంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులు తమ దరఖాస్తులు తీసుకోవడం లేదని రైతులు వాపోయారు. ఎన్నో ఏండ్లుగా పొలం సాగు చేస్తున్నప్పటికీ పట్టా లేకపోవడంతో సదస్సుకు వచ్చి దరఖాస్తు ఇస్తే అధికారులు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. భూభారతితో పెద్ద రైతులకే న్యాయం జరుగుతుందని పేద రైతులకు ఏ మాత్రం న్యాయం జరగడం లేదని రైతు జంగయ్య ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో వందలో 10శాతం మాత్రమే పరిష్కారం అవుతున్నాయే తప్పా 90 శాతం సమస్యలు పరిష్కారం కావడం లేదని మరో రైతు రాజు పేర్కొన్నారు.

పోల్కంపల్లి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు

నల్లమలలో భారీ వర్షం

అమ్రాబాద్, జూన్ 13 : నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో దాదాపు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి అచ్చంపేట-మద్దిమడుగు ప్రధాన రహదారిలో వాన నీరు రోడ్డుపై పారుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

అమ్రాబాద్‌లో భారీ వర్షానికి రోడ్డుపై పారుతున్న నీళ్లు

ప్రాజెక్టులకు జలకళ

అయిజ, జూన్ 13 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం జూరాలకు ఇన్‌ఫ్లో 14వేల క్యూసెక్కులు ఉండగా, నెట్టెంపాడ్ ఎత్తిపోతల పథకం 1,500, కోయిల్ సాగర్ లిఫ్టుకు 315, విద్యుత్ ఉత్పత్తికి 15,241 క్యూసెక్కులు విడుదల చేయగా అవుట్ ఫ్లో 17,125 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 అడుగులు కాగా, ప్రస్తుతం 318.050 ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.710 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కర్ణాటకలో కురుస్తున్న వానలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 8,269 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 92 క్యూసెక్కులు ఉంది. గరిష్ఠ నీటి మట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1602.96 అడుగుల నీటి మట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 25.589 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో 9,310 క్యూసెక్కులు ఉండగా, దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు 8,626 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 684 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుతం 9 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.